సాక్షి
కుమురం భీం

గురువారం । 25 । జనవరి । 2024



పట్టభద్రులే అధికం.. 8లో▸

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది మంది ఎమ్మెల్యేల్లో అధికంగా ఉన్నత విద్యనభ్యసించి పట్టాలు పొందినవారే ఉన్నారు. ఇద్దరు వైద్యులు కూడా ఉండడం గమనార్హం.



మబ్బులతో గుబులు 9లో▸

పలు మండలాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. ఆకాశంలో మబ్బులు రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఆరబెట్టిన మిర్చి పంటపై టార్పాలిన్లు కప్పుతున్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/14.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వలంగా తగ్గుతాయి. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీటీ రోడ్డు నిర్మించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని అఖిల పక్ష నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు రేగుంట కేశవ్‌రావు, రూప్‌నార్ రమేశ్, దినకర్, కార్తీక్ మాట్లాడుతూ పట్టణం నుంచి గుండి రోడ్డు ద్వారా లింక్ రోడ్డు మంజూరు కాగా.. సంబంధిత కాంట్రాక్టర్ నేటి వరకు ప్రారంభించలేదన్నారు. దుమ్ముతో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతోందన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలోని అంబేద్కర్ చౌక్, జన్కాపూర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదని కలెక్టర్ దృషికి తీసుకెళ్లారు. పట్టణంలో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారుతిపటేల్, రాజ్‌కుమార్, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు, గైడ్ టీచర్లను బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ రంగంలో సత్తా చాటాలన్నారు. గ్రామాల్లోకి సైన్స్ కార్యక్రమాలు వెళ్లినప్పుడే దేశ పురోగతి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎస్‌వోలు భరత్, శ్రీనివాస్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం డీఈవో అశోక్, డీటీడీవో రమాదేవితో కలిసి ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. గతేడాది కంటే ఈ విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎస్‌వోలు శ్రీనివాస్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

కౌటాల(సిర్పూర్): మండలంలోని పలు రైస్ మిల్లులను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముత్తంపేట్, తలోడిలోని రైస్ మిల్లుల్లో రికార్డులు పరిశీలించారు. ధాన్యం, బియ్యం నిల్వల వివరాలపై ఆరా తీశారు. సీఎంఆర్ బియ్యం బయటి మార్కెట్‌కు, రేషన్ బియ్యం రైస్ మిల్లుల్లోకి తీసుకొస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కరంజీవాడ పాఠశాలలో ఎస్ఎంసీ సమావేశం(ఫైల్)

బడి ఎన్నికలకు బ్రేక్

- విద్యాశాఖ ఉత్తర్వులు జారీ
- పాత కమిటీల రద్దుతో అయోమయం
- స్కూల్ గ్రాంట్స్ వినియోగానికి హెచ్ఎం, చైర్మన్ సంతకాలు తప్పనిసరి
- వచ్చే విద్యా సంవత్సరంలోనే నూతన కమిటీలు!

కెరమెరి(ఆసిఫాబాద్): మరికొద్ది రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు బ్రేక్ పడింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు సైతం జారీ చేశారు. దాదాపు నాలుగేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ ఆగిపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు సందిగ్ధంలో పడ్డారు. జిల్లాలో 906 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 171 ప్రాథమికోన్నత, 150 ఉన్నత పాఠశాలలు ఉండగా 93,608 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల్లో ఎలక్షన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 20న ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు సైతం అందించారు.

ఈ విద్యాసంవత్సరంలో లేనట్లే..

రాష్ట్రంలో చివరిసారి 2019లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వం రెండుసార్లు వాటి కాలపరిమితిని పొడిగించింది. పాత కమిటీల పదవీ కాలం డిసెంబర్ 31తోనే ముగిసింది. నూతన కమిటీలను ఎన్నుకునేందుకు విద్యాశాఖ ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ చేయగా.. 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అంతలోనే ఎన్నికలు రద్దు చేయడంతోపాటు ప్రస్తుతం ఉన్న విద్యాకమిటీలను కూడా రద్దు చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో మూడు నెలల్లో ఈ విద్యా సంవత్సరం ముగియనుంది. పదో తరగతి పరీక్షల కోసం ఇప్పటికే బడుల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో కొత్త కమిటీల ఏర్పాటు సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పాఠశాలల నిర్వహణ, అభివృద్ధిలో కమిటీ సభ్యుల పాత్ర కీలకం కావడంతో ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. నూతన విద్యా సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్ రావడంతోనే ఎన్నికలు వాయిదా పడినట్లు సమాచారం

నిధుల వినియోగం ఎలా..

పాఠశాలల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల విత్‌డ్రాకు సంబంధించి ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాలకు జాయింట్ చెక్‌పవర్ ఉంటుంది. ప్రస్తుతం పాత కమిటీలు రద్దు కావడంతో నిధుల విత్‌డ్రాపై స్పష్టత రాలేదు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు 50 శాతం నిధులు మాత్రమే ఎస్ఎంసీ ఖాతాల్లో ఇప్పటివరకు జమయ్యాయి. ఈ నిధులు ఖర్చు చేస్తే మరో 50 శాతం నిధులు మంజూరు చేస్తామని విద్యాశాఖ మెలిక పెట్టినట్లు సమాచారం. 2023- 23 విద్యా సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలల గడువు మాత్రమే ఉండటంతో నిధుల వినియోగంపై ఎలా ముందుకెళ్తారనేది తెలియాల్సి ఉంది.

పాత కమిటీలు కొనసాగించాలి



పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించే వరకు పాత కమిటీలను కొనసాగించాలి. పాఠశాలల అభివృద్ధిలో విద్యాకమిటీ సభ్యుల పాత్ర ఎంతో కీలకమైంది. అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ అభివృద్ధి, కార్యక్రమాల నిర్వహణకు సలహాలు, సూచనలు అందజేస్తారు. నిధుల విత్‌డ్రాకు ఉమ్మడి చెక్‌పవర్ ఉండటంతో పాత చైర్మన్‌లను కొనసాగించాలి.

– ఆడే ప్రకాశ్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: బాలికలు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్త్రీశిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలు వద్దు అనుకుంటే.. రేపటి సమాజం అమ్మలేని అనాథ అవుతుందన్నారు. భేటీ పడావో.. భేటీ బచావో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కేజీబీవీలు, ఆశ్రమాల్లో విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రభుత్వ అనేక కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. రక్షణ, స్వేచ్ఛ కోసం అమల్లో ఉన్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి, గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీఎంహెచ్‌వో తుకారాం, జీసీడీవో శకుంతల, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, మహిళా సాధికారత కేంద్రం సభ్యులు శారద, మమత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపోలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన రెండు లహరి, ఒక్కో రాజధాని, ఎక్స్‌ప్రెస్ బస్సులను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డిపో మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ లహరి బస్సులో 33 సీట్లు సిట్టింగ్, 15 సీట్లు స్లీపర్ కోచ్ సౌకర్యం ఉంటుందన్నారు. లహరి బస్సు రాకపోకల సమయాలను రెండు రోజుల్లో ప్రకటిస్తామని ఆర్టీసీ డీఎం తెలిపారు. రెండు బస్సుల్లో ఒకటి వయా కాగజ్‌నగర్, మరొకటి ఆసిఫాబాద్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు నడపనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రయాణికుల అవసరాల మేరకు దూర ప్రాంతాలకు నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, డిపో సూపరింటెండెంట్ శ్రీనివాస్, నాయకులు అజ్మీరా శ్యాంనాయక్, సాయినాథ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి లహరి బస్సును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

- ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నేరాల నియంత్రణ, పరిశోధనకు టెక్నాలజీని వినియోగించి, నేరస్తులకు శిక్ష పడేవిధంగా చూడాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లాలోని పోలీసు అధికారులతో శాంతిభద్రతలపై నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యత, శాస్త్రీయ పరిశోధనలో పోలీసు అధికారులు, సిబ్బంది నిష్ణాతులు కావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరిస్తూ సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. సీఐలు రాజు, బుద్దే స్వామి, సాదిక్ పాషా, ఎస్సైలు ప్రవీణ్, రమేశ్, చంద్రశేఖర్, సాగర్, సిబ్బంది బాబురావు, సత్యనారాయణ, అజిమొద్దీన్, పూల్‌సింగ్, ఉమేశ్, సజాత్ అలాం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.




సీఐ రాజుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

- నేడు జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో పూజలు
- మొక్కులు చెల్లించుకోనున్న ఆదివాసీలు
- ఫిబ్రవరి 8 వరకు ఉత్సవాలు



పూజకు నైవేద్యం తయారు చేస్తున్న ఆదివాసీలు

మహాపూజకు సర్వం సిద్ధం



గుహ వద్ద భక్తుల రద్దీ

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో.. కెరమెరి మండలం మహరాజ్‌గూడ అడవుల్లోని జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో గురువారం మహాపూజ నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి మహాపూజకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు, గౌరవ అధ్యక్షుడు మరప బాజీరావు ప్రకటించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ప్రత్యేక పూజలు మధ్యాహ్నం 12 గంటలకు ముగియనున్నాయి.

అమ్మవారికి ప్రత్యేక నైవేద్యం..

మహాపూజ నేపథ్యంలో టొప్లకస, సిద్దికస నుంచి పవిత్ర జలాలతో తయారు చేసిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించనున్నారు. ఆలయ ప్రాంగణంలోనే ఆదివాసీలు సంప్రదాయం ప్రకారం ఈ నైవేద్యాలు తయారు చేస్తారు. ప్రత్యేక వాయిద్యాలు వాయిస్తూ గుహ లోపలకు వెళ్లి జంగుబాయిని దర్శించుకుంటారు. మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతలకు మేకలు, కోళ్లు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రి భోజనాల అనంతరం అక్కడే సంప్రదాయ నృత్యాలు చేస్తారు. టొప్లకసకు వెళ్లి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహాపూజ కార్యక్రమానికి ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరవుతారని వారు పేర్కొన్నారు. ఈ నెల 14న ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు ఫిబ్రవరి 8 వరకు కొనసాగనున్నాయి.

సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రోడ్డు రవాణా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆర్టీవో గంధం లక్ష్మితో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవంపై సమీక్ష నిర్వహించామన్నారు. దేశవ్యాప్తంగా గంటకు 50 మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతుంటే 19 మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, మద్యం తాగడం, ఇతర ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గోల్డెన్ అవర్ సమయంలో క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తే మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. అనంతరం జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి లక్ష్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులకు సూచనలు చేశామన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి రోడ్డు భద్రత నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఎంవీఐ ఉమామహేశ్వర్‌రావు, సంతోష్‌కుమార్, డీఎస్పీలు కరుణాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, డీటీవో గంధం లక్ష్మి, తదితరులు

బెల్టు షాపులు ఎత్తివేయాలని ధర్నా



ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: తమ గ్రామంలో బెల్టు షాపులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వాంకిడి మండలం గోయగాంకు చెందిన మహిళలు బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. గోయగాం గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయడంతో యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ షాపులను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇసురు బాయి, కాంతమ్మ, కమల, సరస్వతి, తానుబాయి, అనసూయ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

వాంకిడి(ఆసిఫాబాద్): అగ్ని ప్రమాద సమయంలో తీసుకునే రక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన అవసరమని డీఐఈవో ఎస్.శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో గ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు చెలరేగితే ఎలా ఆర్పివేయాలతో ప్రత్యక్షంగా చూపించారు. భారీ ప్రమాదాల సమయంలో తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు సతీశ్, మహేశ్, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుస్తక పఠనంతో అపార జ్ఞానం

ఆసిఫాబాద్‌రూరల్: పుస్తక పఠనంతో అపార జ్ఞానం సంపాదించవచ్చని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి రీడథాన్(పఠన పోటీలు)లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఒక పుస్తకం వందమంది మిత్రులతో సమానమన్నారు. రూం టు రీడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పఠన పోటీల్లో 623 మంది పాల్గొన్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన 45 మంది పాల్గొనగా.. వీరిలో దహెగాం మండలం రాస్పెల్లికి చెందిన సంజన మొదటి బహుమతి పొందగా, రెండో బహుమతి వాంకిడి మండలం లెండిగూడకు చెందిన సిద్దేశ్వర్, మూడో బహుమతి పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయికి చెందిన అఖిల సాధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌వోలు శ్రీనివాస్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు ఇస్తున్న డీఈవో అశోక్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కౌటాల(సిర్పూర్): ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీవోఎస్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. గడువు ముగిసిన ఎరువులు, మందులు నిల్వలు దుకాణాల్లో ఉంచొద్దని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ధరలను నిత్యం సూచిక బోర్డులో నమోదు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏవో పి.రాజేశ్, డీలర్లు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


హరీష్

వేమనపల్లి: మండలంలోని ముక్కిడిగూడం గ్రామానికి చెందిన తలండి హరీష్ ఈ నెల 20వ తేదీన అదృశ్యమైనట్లు తండ్రి సురేష్ తెలిపారు. శనివారం ఉదయం బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడి మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు హైదరాబాద్‌లో గాలిస్తున్నారు. యువకుడి ఆచూకీ తెలిస్తే 99493 92918, 84649 14704 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలిక ప్రాణం తీసిన మూఢనమ్మకం!

వేమనపల్లి: వైద్య పరంగా ఎంత అభివృద్ధి సాధిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను మూఢనమ్మకాలు వీడడం లేదు. పాముకాటు వేస్తే సకాలంలో ఆస్పత్రికి వెళ్లకుండా భూతవైద్యుడి వద్దకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చిన్నారి(4) మంగళవారం సాయంత్రం ఇంటి పక్కన మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లగా పాముకాటు వేసింది. కుటుంబ సభ్యులు వేమనపల్లి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చేలోపు ఇరుగుపొరుగు మాటలు విని కుమురంభీం జిల్లా దహెగాం మండలం కొంచెల్లిలోని ఒక నాటువైద్యుడి వద్దకు వెళ్లారు. ఆ చిన్నారి ధరించిన వస్త్రాలకు రాళ్లు ముడివేసి ప్రైవేట్ వాహనంలో హుటాహుటిన చేరుకున్నారు. భూతవైద్యుడి వద్దకు వెళ్లే లోపే చిన్నారి మృతిచెందినట్లు తెలుస్తోంది. అప్పటికే చిన్నారి చనిపోయిందని, మృతదేహాన్ని ఎందుకు తీసుకువచ్చారని భూతవైద్యుడు తెలుపడంతో కుటుంబ సభ్యులు కన్నీరమున్నీరయ్యారు. ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

క్రిస్టియన్ జేఏసీ చైర్మన్‌గా నోవాహు


నియామక పత్రం అందుకుంటున్న నోవాహు

లక్సెట్టిపేట: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా పట్టణానికి చెందిన కడమండ్ల నోవాహు ఎన్నికైనట్లు బుధవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రం రాష్ట్ర చైర్మన్ రవికుమార్ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా పై ఉంచిన నమ్మకాన్ని కాపాడుతానని తెలిపారు. రాష్ట్ర కో కన్వీనర్ సారయ్య నాయకులు రత్నరాజు, న్యాయవాది మేదరి పాల్‌సన్, హనోక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ


బిల్లులు పరిశీలిస్తున్న అధికారులు

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2015- 16 సంవత్సరానికి సంబంధించి పాల ప్యాకెట్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై బుధవారం వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో కీలక ప్రతాలను పరిశీలించారు. ఈ నెల 22 నుంచి చేపట్టిన విచారణను త్వరలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్, కుమురంభీం డీడబ్ల్యూవోలు రసూల్ బి, సావిత్రి, సీడీపీవో ఇందిర తదితరులు ఉన్నారు.

పట్టభద్రులే అధికం..



- ఎమ్మెల్యేల్లో ఇద్దరు డాక్టర్లు
- శ్రీమంతుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- రాష్ట్రంలోనే మొదటి స్థానం

సాక్షి, మంచిర్యాలడెస్క్: రాష్ట్ర వ్యాప్తంగా గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో అధిక శాతం ఎమ్మెల్యేలు ఉన్నత విద్యనభ్యసించి పట్టాలు పొందిన వారే ఉన్నారు. ఇద్దరు వైద్యులు కూడా ఉండడం గమనార్హం. ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ ఈ నెల 24న రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు సంబంధించిన సమాచారాన్ని విడుదల చేసింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఎమ్మెల్యేలపై ఉన్న కేసులు, విద్యార్హతలు, ఆస్తులు, వయస్సు వివరాలు వెల్లడించింది.

ఇద్దరు వైద్యులు
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం నుంచి తొలిసారి బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పాల్వాయి హరీష్‌బాబు ఎంఎస్ ఆర్థో అభ్యసించారు. కాగజ్‌నగర్‌లో సొంత ఆస్పత్రి ఉండగా.. కొంతకాలం వైద్యుడిగా పని చేశారు. చెన్నూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వివేకానంద ఎంబీబీఎస్ అభ్యసించారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన వ్యాపారంలో స్థిరపడ్డారు.

- బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ బీకాం, మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిగ్రీ, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎంఏ, బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్, నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీఏ, ముథోల్ బీజేపీ ఎమ్మెల్యే రామారావు పవార్ బీఎస్సీ అభ్యసించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి విద్యార్హతలేవీ(నోఫార్మల్ ఎడ్యుకేషన్) పేర్కొనలేదు.

'సిరి'మంతుడు వివేక్



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 మంది ఎమ్మెల్యేల్లో చెన్నూర్‌కు చెందిన ఎమ్మెల్యే వివేకానంద్ రూ.606.67 కోట్ల స్థిర, చరాస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. వంద కోట్లకు పైగా ఆస్తులున్న క్లబ్‌లో ఏడుగురు ఉండగా వివేకానంద్ టాప్‌లో ఉండడం గమనార్హం.

ఖానా'పూర్ ఎమ్మెల్యే'
ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రాష్ట్రంలోనే అందరి కంటే పేద ఎమ్మెల్యే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేల్లో ఆర్థిక స్థితి పరంగా పరిశీలిస్తే ఆయన వద్ద కేవలం రూ.24లక్షలు మాత్రమే ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. హరీశ్‌బాబు ఆస్తులు రూ.4.19 కోట్లు, వినోద్‌కు రూ.197.12, ప్రేంసాగర్‌రావుకు రూ.54.13, కోవ లక్ష్మికి రూ.2.31 కోట్లు, పాయల్ శంకర్‌కు రూ.7.5కోట్లు, జాదవ్ అనిల్‌కు రూ.1.93 కోట్లు, మహేశ్వర్‌రెడ్డికి రూ.32.84 కోట్లు, రామారావుపవార్‌కు రూ.20.14 కోట్లు ఉన్నాయి.

వెడ్మ బొజ్జుపైనే కేసులు ఎక్కువ



రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలపై పలు కేసులు నమోదయ్యాయి. ఆందోళనలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు, భూకబ్జాలు, మోసం, చెక్‌బౌన్స్, మారణాయుధాలతో గాయపర్చడం తదితర కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. కేసుల పరంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్‌లపై అత్యధికంగా 89 చొప్పున కేసులతో మొదటి స్థానంలో ఉండగా.. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేల్లో వెడ్మ బొజ్జు 52 కేసులతో రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నారు. పాల్వాయి హరీశ్‌బాబుపై 9కేసులు, గడ్డం వినోద్‌పై 4, కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై 40, పాయల్ శంకర్‌పై 11, ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై 8, రామారావు పవార్‌పై 2 కేసులు ఉన్నాయి. గడ్డం వివేకానంద్, కోవ లక్ష్మి, జాదవ్ అనిల్‌కుమార్‌లపై కేసులేమీ లేవు.

సీనియర్ సిటిజన్ రామారావు పవార్



ఉమ్మడి జిల్లాలోని పది మంది ఎమ్మెల్యేల్లో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పవార్ వయస్సు పరంగా సీనియర్ సిటిజన్. ఆయన వయస్సు 69 సంవత్సరాలు. పిన్న వయస్కులు వెడ్మ బొజ్జు.. ఆయన వయస్సు 37 సంవత్సరాలు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే అత్యధిక వయస్కులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి(74) కాగా, పిన్న వయస్కులు నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి(30) ఉన్నారు. హరీశ్‌బాబు(44), వివేకానంద(66), వినోద్(67), ప్రేంసాగర్‌రావు(63), కోవ లక్ష్మి(53), పాయల్ శంకర్(52), జాదవ్ అనిల్‌కుమార్(49), మహేశ్వర్‌రెడ్డి(54).

ఒకరి మృతికి కారణమైన నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: కెరమెరి మండలం ధనోరా కొలాంగూడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ధనోర కొలాంగూడ గ్రామానికి చెందిన సీడం కట్టి అనే వ్యక్తి సోమవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన సీడం భీము అనే వ్యక్తి ఇంటికి వెళ్లి(భీము ఇంట్లో లేకపోవడంతో) ఈ రోజు రాత్రి వేటకు రావాలని అతడి భార్య భీంబాయికి చెప్పి వెళ్లాడు. రాత్రి 9గంటల ప్రాంతంలో కట్టి చెప్పిన అటవీ ప్రాంతానికి భీము ఒంటరిగా బయలుదేరాడు. అప్పటికే విద్యుత్ తీగలు అమర్చి ఉండటంతో ఆ తీగలకు తగిలి భీము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీడం కట్టిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కెరమెరి ఎస్సై విజయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య


రాజ్‌కుమార్ మృతదేహం

తాండూర్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని వాల్మీకినగర్‌కు చెందిన అబ్బర్ల రాజ్‌కుమార్ (20) తల్లి అబ్బర్ల దేవక్క నాలుగేళ్ల క్రితం అకాల మృతి చెందగా తొమ్మిది నెలల క్రితం తండ్రి రాజమల్లు ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి తండ్రులను కోల్పోయిన రాజ్‌కుమార్ ఒంటరిగా ఉంటూ మానసికంగా కృంగిపోయాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రాజ్‌కుమార్ వాల్మీకినగర్ శివారు ప్రాంతంలో ఉన్న పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజ్‌కుమార్ మృతిపై నానమ్మ అబ్బర్ల మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీ గ్యాస్‌సిలిండర్లు స్వాధీనం


పట్టుకున్న గ్యాస్ సిలిండర్లతో రెవెన్యూ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పలు హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలెండర్లను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనపర్చుకున్నారు. పట్టణంలోని మున్నీ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఐదు సిలిండర్లు, మున్నీ హోటల్‌లో ఏడు సబ్సిడీ సిలిండర్లు, కాకతీయ మెస్‌లో ఆరు సబ్సిడీ సిలిండర్లను స్వాధీనపర్చుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు విలేకరులకు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు రాజ్‌కుమార్, శ్యాంలాల్, శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్ పాల్గొన్నారు.

మామిడిపిందె ఆకారంలో..


మామిడిపిందె ఆకారంలో కోడిగుడ్డు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ ఫొటోలో చూస్తుంది.. మామిడిపిందె అనుకుంటున్నారా.? అయితే మీరు పప్పులో కాదు కాదు.. తప్పులో కాలేసినట్లే.. అవును ఇది నిజం.. ఇది మామిడిపిందె కాదు.. మామిడి పిందె ఆకారంలో ఉన్న అసలు సిసలైన 'కోడిగుడ్డు'.. ఇది నమ్మాల్సిన నిజమే.. మామిడి పిందెలాంటి గుడ్డు కథలోకి వెళ్తే.. హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న దుమ్మల శ్రీనివాస్‌యాదవ్ కిరాణంలో గురువారం ఈ మామిడిపిందె ఆకారంలో ఉన్న కోడిగుడ్డు కనిపించింది. అప్పుడే వచ్చిన కోడిగుడ్ల నిల్వను దుకాణంలో ఓ చోట పెడుతూ ఉండగా ఒక్కసారిగా గుడ్ల ట్రేలో తేడా కనిపించడంతో పరీక్షించి చూడగా కోడిగుడ్డు రూపం గమ్మత్తుగా అగుపించింది. కోడిగుడ్డు అచ్చంగా 'మామిడిపిందె' ఆకారంలో విచిత్రంగా కనబడటంతో ఆ గుడ్డును అంతా విచిత్రంగా చూస్తూ ఔరా.! ఇదేంటీ ఈ విచిత్రం సుమా.. అనుకోవడం కొసమెరుపు..

నైట్‌వాచ్‌మన్ పోస్టు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్ పోస్టు భర్తీకి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈనెల 25 నుంచి 30లోగా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. జిల్లాకు చెందిన పురుష అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ పిట్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన పిట్ కమిటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం గనిపై జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ సెక్రెటరీ నక్క సుమన్ పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ సెక్రటరీగా పృథ్వి, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా శ్రావణ్, అడ్వైజర్‌గా దేవేందర్ సాయిలు, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా అంజి, ఏ రిలే ఇన్‌చార్జిగా సుజిత్, బీ రిలేకు శంకర్ నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంద వెంకటేష్, లక్ష్మణ్, మురళి, వాసు, దేవి శ్రీనాథ్, రవిబాబు కోటేశ్వరరావు, డేవిడ్ పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువతి బలవన్మరణం


బైకం కీర్తన(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తండ్రి మందలించాడని కూతురు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హాజీపూర్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బైకం కీర్తన(19) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కీర్తన గత కొంత కాలంగా చదువు పక్కనపెట్టి టీవీ చూడటం, మొబైల్ ఫోన్‌తో గడుపుతుండగా మంగళవారం ఉదయం తండ్రి కుమార్ మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కీర్తన క్షణికావేశంలో ఇంట్లోని గుర్తు తెలియని పురుగుల మందుతాగింది. కుటుంబీకులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హాజీపూర్ ఏఎస్సై చాంద్‌పాషా తెలిపారు.

దంపతులపై దాడి..

మందమర్రిరూరల్: మంచిర్యాల నుంచి ఆర్టీసీ బస్సులో దేవాపూర్ వెళ్తున్న దంపతులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... భార్యాభర్తలు జ్యోతి, రాజశేఖర్ మంచిర్యాలలో బస్సు ఎక్కిగా సీటు విషయంలో జ్యోతితో ఓ మహిళ గొడవకు దిగింది. ఈ క్రమంలో ఆ మహిళ మందమర్రిలోని తన బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. మందమర్రి యాపల్ ప్రాంతానికి బస్సు రాగానే సదరు మహిళకు సంబంధించిన వ్యక్తులు బస్సెక్కి దంపతులపై దాడికి దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే


సంపత్


ఎం. మధూకర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో విధి నిర్వాహణలో ప్రతిభ కనబరిచిన 18 మందిని కంపెనీ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసింది. వీరిని ఈనెల 26న నస్పూర్ గోదారికాలనీలోని ప్రాణహిత స్టేడియంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించనున్నారు. వీరిలో ఆర్కే 5 గని నుంచిలశెట్టి మల్లేష్ హెచ్‌వోఎం, అయిడపు ధనుంజయ ఎలక్ట్రీషన్, ఆర్కే 6 గని నుంచి కందికొండ వంశీకృష్ణ మెకానిక్, జక్కుల ఎర్రన్న సపోర్టుమెన్, ఆర్కే 6 నుంచి ఓరుగంటి బ్రహ్మయ్య, ఎస్‌డీఎల్ ఆపరేటర్, సంగం శివకుమార్ సపోర్టుమెన్, ఆర్కే న్యూటెక్ గని నుంచి కోడిపుంజుల రాజయ్య హెచ్‌ఓఎం, కొంగ సత్తయ్య సపోర్ట్ మెన్, ఎస్ఆర్పీ 1 గని నుంచి కుక్క దేవానందం, ఫిట్టర్, చెలిమెల తిరుపతి కోల్‌కట్టర్, ఎస్సార్పీ 3,3ఏ గనిన ఉంచి ఆడెపు రాజమల్లు హెచ్‌ఓఎం, బత్తుల సతీశ్‌కుమార్, ఫిట్టర్, ఐకె 1 గని నుంచి కందుల శ్యాం కుమార్ సపోర్ట్ మెన్, కుక్కల రమేష్ కోల్‌కట్టర్, ఇందారం ఓపెన్ కాస్ట్ గని నుంచి బండారి శ్రీనివాస్ ఎలక్ట్రిషన్, జనగాం మధు జనరల్ మజ్దూర్, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని నుంచి భాస్కర్ రావు ఫిట్టర్, ఎస్ దేవానంద్, హెచ్‌ఓఎంలను ఎంపిక చేశారు.

ఉత్తమ సింగరేణియన్‌గా..
కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో నుంచి ఒక్కో ఉద్యోగిని, ఒక్కో అధికారిని ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీ చేతుల మీదుగా సన్మానం చేస్తారు. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ నుంచి ఉత్తమ సింగరేణియన్‌గా ఐకే 1ఏ గనికి చెందిన ఎం.మధూకర్, ఉత్తమ అధికారిగా శ్రీరాంపూర్ ఓసీపీకి చెందిన ఎన్నపురెడ్డి సంపత్ (డెప్యూటీ ఎస్ఎస్ఓ) లను ఎంపిక చేశారు.

మందమర్రి ఏరియాలో...


కుమ్మరి జెస్సీరాజ్


జె.నాగరాజ్

మందమర్రిరూరల్: రిపబ్లిక్ డే సందర్భంగా మందమర్రి ఏరియాలోని ఉత్తమ అధికారి, ఉద్యోగులను సింగరేణి యాజమాన్యం ఎంపిక చేసింది. ఏరియా నుంచి సింగరేణి వ్యాప్త ఉత్తమ అధికారిగా జె.నాగరాజ్ ఏజీఎం (ఈఅండ్ ఎండి) ఏరియాలో కేకే-5గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించే కుమ్మరి జెస్సీరాజ్ ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికయ్యాడు. అలాగే ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఎనగందుల వెంకటరాజం కోల్‌కట్టర్, పల్లె అంజిరెడ్డి ఎలక్ట్రీషియన్ (కాసిపేట గని), ఎంబడి అంజయ్య కోల్‌కట్టర్, వెంగల రాజన్న ఎస్డీఎల్ ఆపరేటర్ (కేకే-5), ఆవుల మహేష్ ఫిట్టర్, మహమ్మద్ అమీర్ ఖాన్ హెడ్ ఓవర్మన్ (శాంతిఖని), వైనాల సురేష్ హెడ్ ఓవర్మన్, గుడిమల్ల ధర్మేందర్ జనరల్ మజ్దూర్ (ఆర్కే ఓసీపీ), మల్యాల విజయ్‌కుమార్ ఈపీ ఆపరేటర్, సల్లం మహేష జనరల్ మజ్దూర్ (కేకే-ఓసీపీ), కల్వచర్ల శ్రీనివాస్ కోల్‌కట్టర్ (టింబర్ మెన్ ట్రైనీ), కనకం రమేష్ హెల్పర్ (కాసిపేట-2గని) ఉద్యోగులు ఎంపికయ్యారు.

దుబ్బగూడెంలో సర్వే అడ్డుకున్న గ్రామస్తులు


అధికారులతో వాదనకు దిగిన గ్రామస్తులు

కాసిపేట: గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ, సింగరేణి అధికారులు సర్వేలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తూ బుధవారం గ్రామస్తులు సర్వేను అడ్డుకున్నారు. కేకే ఓసీపీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంలో అధికారులు ఇంటి స్థలాలు కాకుండా అదనంగా ఉన్న భూములను సర్వే చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా తమ భూములు ఎలా చూపిస్తామని, ఇప్పటికే ఒక్కరి భూమి ఒక్కరు రాయించుకుని డబ్బులు తీసుకున్నారని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరిద్దరి కనుసన్నల్లో అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ సామాన్యులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సర్వేను నిలిపివేస్తున్నామని రేపటి నుంచి సర్వే చేస్తామని అందరు సిద్ధంగా ఉండాల్సిందిగా తెలిపి అధికారులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ సులోచన, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగిన యువకుడి మృతి

- మృతదేహంతో మహిళ ఇంటి ఎదుట ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్
- పోలీసుల జోక్యంతో విరమణ


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ రాజు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన ఎండీ సల్మాన్(30) ఈ నెల 22న పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించగా వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతూ 23న మృతిచెందిన విషయం తెలిసిందే. సల్మాన్ మృతికి బండ రజిని కారణమంటూ ఆమె ఇంటి ఎదుట సల్మాన్ మృతదేహంతో కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళనకు దిగారు. రెండు గంటల పాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ రాజు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. సల్మాన్ మృతికి కారణమైన రజినిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతోందని...
రజిని, సల్మాన్‌లు ఎనిమిదేళ్లుగా ప్రేమించుకున్నారని, ఈ క్రమంలోనే రజిని మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. కొంతకాలం తరువాత అతడితో విడాకులు తీసుకుని సల్మాన్‌కు దగ్గరైంది. దీంతో రజిని కుటుంబ సభ్యులు గతంలో దాడికి సైతం పాల్పడ్డారు. దీంతో ఇరువురి పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఇద్దరిని వేరుగా ఉండాలని నిర్ణయించారు. పెద్దల ఒప్పందాన్ని ధిక్కరించి ఇద్దరు మళ్లీ ఒక్కటయ్యారు. ఈ నేపథ్యంలో రజిని సల్మాన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేయడంతో రూ.4లక్షలు ఇచ్చాడు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో ఇరువురి మధ్య మనస్పార్థలు వచ్చారు. రూ.2లక్షలు తీసుకు రావాలని, లేకుంటే చచ్చిపోతానని రజిని బ్లాక్‌మెయిల్ చేయడంతో మనస్తాపానికి గురైన సల్మాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి పెద్దమ్మ గౌషియ పేర్కొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపాడు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్వోటూ జీఎం


సూచనలు చేస్తున్న జీఎం మనోహర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు భీమన్న స్టేడియంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్వోటూ జీఎం నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల నుంచి పెద్ద మొత్తంలో ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. వేడుకల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించే ఉత్తమ ఉద్యోగుల సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని అన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన
మందమర్రిరూరల్: ఏరియాలో ఈనెల 26 రిపబ్లిక్ డే వేడుకలకు సింగరేణి హైస్కూల్ మైదానంలో యాజమాన్యం ఏర్పాటు చేస్తోంది. బుధవారం ఏరియా జీఎం మనోహర్ అధికారులతో కలిసి హైస్కూల్ మైదానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, అధికారులు ఆసీఫ్, జయప్రకాష్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

పోస్టుల భర్తీకి పరీక్షలు


పర్యవేక్షిస్తున్న ఎస్ఓటూ జీఎం రఘుకుమార్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న మున్షీ, హెడ్‌చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్, డంప్‌మెన్, ట్రిప్‌మెన్‌పోస్టుల భర్తీకి ప్రాక్టికల్, రాత పరీక్షలు బుధవారం నిర్వహించారు. అంతర్గత ఉద్యోగులతో వీటిని భర్తీ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ ఎంవీటీసీలో వీటికి సంబంధించిన రాత పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఏరియా ఎస్ఓటూజీఎం రఘుకుమార్ పరిశీలించారు. పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అరుంధతి పాల్గొన్నారు.